క్లుప్తంగా

నవజీవన్ నగర్ అధ్యక్షుడిగా రామ్మోహన్



అధ్యక్షుడిని సన్మానిస్తున్న బండి రమేష్

కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్ పరిధిలోని నవజీవన్ నగర్‌లో జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా రామ్మోహన్ విజయం సాధించారు. బుధవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అతడిని సన్మానించారు. రాజకీయాలకతీతంగా కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, యుగేందర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నూతన బోరు మోటార్ ఏర్పాటు



బోరు మోటార్‌ను ఏర్పాటు చేయిస్తున్న కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులో హమాలి యూనియన్ కార్యాలయం వద్ద మూసాపేట కార్పొరేటర్ మహేందర్ బుధవారం బోరులో కొత్త మోటార్‌ను ఏర్పాటు చేయించారు. కొన్ని నెలలుగా మరమ్మతులు రావడంతో సంబంధిత అధికారులకు తెలిపినా నిధులు లేవని చేతులెత్తాశారు. దీంతో కార్పొరేటర్ ప్రముఖ కంపెనీతో మాట్లాడి సీఎస్ఆర్ నిధులతో నూతన మోటారు ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో ఐలయ్య, శివరాజ్‌యాదవ్, పాలాకి కిశోర్, కృష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న నాయకులు

మూసాపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ నాయకుడు గోపిశెట్టి రాఘవేందర్ అన్నారు. మూసాపేట డివిజన్ భరత్‌నగర్‌కాలనీ ఈడబ్ల్యూఎస్ కాలనీలో డ్రైనేజీ సమస్యను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా డ్రైనేజీ సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మంచినీటిలో కూడా డ్రైనేజీ కలుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమస్యను ఇప్పటికైనా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సతీష్‌గౌడ్, వెంకటేశ్‌యాదవ్, తూము సచిన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌కు ఉత్తమ పోలీస్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఇన్‌స్పెక్టర్ రాజేశ్

మూసాపేట: కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పి. రాజేశ్‌కు ఉత్తమ పోలీస్ అధికారి అవార్డును బుధవారం బాలానగర్ డీసీపీ కె. సురేష్‌కుమార్, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు చేతుల మీదుగా అందుకున్నారు. లోక్ అదాలత్ కేసుల పరిష్కారం, అదేవిధంగా పని తీరుపై ఉత్తమ పోలీస్ అధికారిగా గుర్తించి ఈ అవార్డును అందజేశారు.

చిన్నారి అదృశ్యం



మల్లిక (ఫైల్)

మియాపూర్: చిన్నారి ఆడుకుంటూ వెళ్లి అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని ఓంకార్ నగర్ బస్తీలో నివాసముంటున్న కడమంచి మహేష్, సుజాత దంపతులకు ఓ కుమారుడు, కూతురు మల్లిక(6) ఉన్నారు.కుమారుడు హాస్టల్‌లో ఉంటుండగా కూతురు తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. ఈ నెల 21వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో మల్లిక ఆడుకునేందుకు బయటకు వెళ్లింది. కొంత సమయం తర్వాత కూతురి కోసం తల్లిదండ్రులు బయటకు వెళ్లి చూడగా కనిపించలేదు. దీంతో చుట్టుపక్క వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి మహేష్ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొండాపూర్‌కు కొత్త ఎక్సైజ్ స్టేషన్

ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో కార్యాలయం | ఏప్రిల్ 1 నుంచి కార్యకలాపాలు | ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్‌గా లక్ష్మణ్‌గౌడ్



శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్

చందానగర్: ఇటీవల రాష్ట్రంలో కొత్తగా ఎక్సైజ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో శేరిలింగంపల్లి మండలంలోని ఎక్సైజ్ స్టేషన్ రెండుగా విడిపోనుంది. శేరిలింగంపల్లి అభివృద్ధి చెందుతున్న క్రమంలో భారీగా కార్యాలయాలు, ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. దశాబ్ద కాలంలో శేరిలింగంపల్లి మండలం భారీగా విస్తరించడం.. సుమారు 15 లక్షలకు పైగా ప్రజలు నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ప్రజల రక్షణ, భద్రత కోసం చందానగర్, మియాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్లు ఇప్పటికే ఉన్నాయి. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ మాత్రం ఒక్కటే ఉంది. క్రైమ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అరకొర భద్రత సిబ్బంది ఉండడం వలన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత కొన్ని సంవత్సరాల నుంచి మరో ఎక్సైజ్ స్టేషన్ కావాలని ఉన్నతాధికారులకు విన్నవించగా ఎట్టకేలకు 2024లో శేరిలింగంపల్లి మండలంలో నూతనంగా కొండాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం 6 నెలల తరువాత హఫీజ్‌పేట్‌లోని ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న నైట్ షెల్టర్ భవనంలో కొండాపూర్ ఎక్సైజ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతానికి శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

- మండలంలో ఉన్న ఎక్సైజ్‌స్టేషన్‌ను డివిజన్‌లవారీగా విభజన చేశారు.
- కొండాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోకి మాదాపూర్, కొండాపూర్ డివిజన్లు ఉంటాయని, శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గచ్చిబౌలి, చందానగర్, మియాపూర్, శేరిలింగంపల్లి డివిజన్లు వస్తాయి.
- ఇప్పటికి వరకు ఉమ్మడి శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో 39 వైన్ షాపులు, 134 బార్‌లు ఉన్నాయి.
- విభజన తరువాత శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్ లోకి 21 వైన్ షాపులు, 73 బార్‌లు, కొండాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌లోకి 18 వైన్ షాపులు, 71 బార్‌లు ఉండనున్నాయి.
- త్వరలోనే ఓల్డ్ హఫీజ్‌పేట్ ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న నైట్ షెల్టర్ భవనంలో కొండాపూర్ ఎక్సైజ్ స్టేషన్ ఏర్పాటవనుంది.

క్రైం రేటు తగ్గించడానికే విభజన



శేరిలింగంపల్లి మండలం చాలా పెద్దది. దానికి తోడు జనాభా పెరుగుతోంది. సుమారు 5 లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లు ఉన్న చోట కేవలం ఒక్క ఎక్సైజ్ స్టేషన్ ఉంది. గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రభుత్వానికి మరో స్టేషన్ ఏర్పాటు చేయాలని విన్నవించాం. 2024 నవంబర్‌లో ఉత్తర్వులు వచ్చాయి. త్వరలో కొండాపూర్ ఎక్సైజ్‌స్టేషన్‌కు పూర్తి స్థాయి సిబ్బందిని కేటాయిస్తారు. క్రైమ్ కేసులు అదుపు చేయడానికి సులువు. అప్పటి వరకు శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్ ఇంచార్జిగా వ్యవహరిస్తుంది. – లక్ష్మణ్ గౌడ్, ఇన్‌స్పెక్టర్, శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్‌స్టేషన్



కొండాపూర్ ఎక్సైజ్ స్టేషన్ ఏర్పాటుకానున్న హఫీజ్‌పేట్ నైట్ షెల్టర్ బిల్డింగ్

సీఎంకు ఎమ్మెల్యే వినతి

నిధులు మంజూరు చేయాలని



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: నియోజకవర్గంలోని వివిధ సమస్యల పరిష్కారానికి సత్వరం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సీఎంను అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్ల నిర్మాణం, మురుగునీటి వ్యవస్థ, తాగునీటి నూతన పైప్‌లైన్‌ల నిర్మాణం, పార్కులు, శ్మశాన వాటికల నిర్మాణం పనులకు సుమారు రూ. 25 కోట్ల నుంచి 30 కోట్ల వరకు నిధులు అవసరమని తెలిపారు. కూకట్‌పల్లి మండల పరిధిలోని హైదర్‌నగర్ గ్రామం సర్వే నంబర్ 145,163 లలో నిర్మాణ అనుమతులను నిలిపివేసి స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దశాబ్దాల కాలంగా ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రభుత్వపరమైన అన్ని అనుమతులను జారీ చేశారని వివరించారు. ఇటీవల కాలంలో నిర్మాణ అనుమతులను నిలిపివేయడంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా జేఎన్‌టీయూ వెనుక ఉన్న సాయినగర్ వాసుల ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్ విషయంలో ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. 2014కు ముందు ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు డబ్బులు చెల్లించేందుకు కాలనీ వాసులు సిద్ధంగా ఉన్నారని, వారికి న్యాయం చేయాలన్నారు.

మంత్రికి ఇఫ్తార్ విందు ఆహ్వానం



మంత్రికి ఆహ్వానం అందజేసి సన్మానిస్తున్న కార్పొరేటర్, ముస్లింలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ చౌరస్తాలో ఉన్న ఈద్గా వద్ద వచ్చే శుక్రవారం నిర్వహించే ఇఫ్తార్ విందుకు హాజరవ్వాలని బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఆహ్వానం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్, నాయకులు రామకృష్ణగౌడ్, షౌకత్‌అలీ మున్నా, సయ్యద్, ఇస్మాయిల్, సుల్తాన్, షబ్బీర్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యంలో తడి, తాలు లేకుండా

రైతులను చైతన్యపరచాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి



అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు

సాక్షి,సిటీబ్యూరో: రైతులు వరి ధాన్యాన్ని తడి,తాలు, దుమ్ము లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా చైతన్యపరచాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి.విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో యాసంగి 2024–25 కాలానికి సంబంధించి ధాన్యం సేకరణపై కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, రైస్ మిల్లుల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు.

పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ సుగుణబాయి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రకళ, జిల్లా సహకారశాఖ అధికారి వెంకట్‌రెడ్డి, సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వరికోత సమయంలో వరి నూర్పిడి యంత్రాల వారితో మాట్లాడి ఓ క్రమపద్ధతిలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సన్న, దొడ్డు వడ్లను వేరుచేసి..

ఒకే కేంద్రంలో సన్న వడ్లు, దొడ్డు వడ్లకు ప్రత్యేక విభాగాలను ముందస్తుగా ఏర్పాటు చేయాలన్నారు. వాటి లోడులను కూడా వేర్వేరుగా రైస్ మిల్లులకు పంపాలన్నారు. ఈ మేరకు రిజిస్టర్లను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వ నియమాల ప్రకారం అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవడంతో పాటు వారు విక్రయించిన ధాన్యం డబ్బులు 48 గంటల్లో నేరుగా వారి ఖాతాలో జమ చేయాలన్నారు. అధికారులు సమిష్టిగా పనిచేసి జిల్లా, ప్రభుత్వానికి ధాన్యం కొనుగోళ్ల విషయంలో మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

గాయత్రీనగర్ సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకారం

మోతీనగర్ : అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రీ నగర్ చంద్ర గార్డెన్‌లో బుధవారం నూతన సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకార జరిగింది. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహాగౌసుద్దీన్, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్ హాజరయ్యారు. అధ్యక్షుడిగా నందు కృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ చారి, జాయింట్ సెక్రటరీగా విష్ణువర్ధన్‌రెడ్డి, కోశాధికారిగా శ్రీలత, చైర్మన్‌గా లక్ష్మణ్ గుప్తా, వైస్ చైర్మన్‌గా కాశీనాథ్ చారి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ గుప్తా, జనరల్ సెక్రటరీగా శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా రాజశేఖర్ రెడ్డి, కోశాధికారిగా రఘురాం ప్రసాద్, కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, కో ఆర్డినేటర్ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబిహాగౌసుద్దీన్

30 రోజుల వేసవి శిక్షణ శిబిరాలు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే 01 నుంచి 31 వరకు 14 ఏళ్ల లోపు ఉన్న బాలబాలికలకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాల(క్రీడలు)ను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి గోపాల్‌రావు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 28 వరకు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కార్యాలయంలో నేరుగా దరఖాస్తులను అందజేయాలన్నారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లు అందజేత

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో కులాంతర వివాహం చేసుకున్న ముగ్గురి జంటలకు బుధవారం రెండున్నర లక్షల చొప్పున ఫిక్స్ డిపాజిట్ బాండ్లను అందజేశారు. బాలానగర్‌కు చెందిన మధుకర్, కూకట్‌పల్లికి చెందిన ఏ. లోకేశ్, ప్రశాంత్‌నగర్‌కు చెందిన సాయిప్రదీప్‌లకు బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ పాండు, హెచ్‌డబ్ల్యూఓలు కొండల్ రావు, నరసింహ, పాండు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు పరామర్శ



ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రామారావు నగర్‌లో కాశీయాత్రలో ప్రమాద బాధితులు, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం పరామర్శించారు. నాలుగు రోజుల క్రితం కాశీయాత్ర ముగించుకుని తిరుగు ప్రయాణంలో బస్సు అదుపు తప్పి పడటంతో రామారావు నగర్‌కు చెందిన మల్లమ్మ మృతి చెందింది. గాయపడిన రాధాకృష్ణ నగర్‌కు చెందిన సక్కుబాయిని, తదితరులను పరామర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

మోతీనగర్: రామారావునగర్‌లో కాంగ్రెస్ నాయకుడు గిరిధర్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇలాంటి కార్యక్రమాలు హిందూ ముస్లింల మధ్య సోదర భావాన్ని నెలకొల్పేందుకు దోహదపడతాయన్నారు.

ఎల్లమ్మబండ పరిధిలో..

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్‌లో షేక్ బీబీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ హాజరయ్యారు.

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఇఫ్తార్ విందులు శాంతిని పెంపొందిస్తాయని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. హస్మత్‌పేట్ ముస్లిం బస్తీలో బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ ఏజాజ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ముస్లింలకు పండ్లను తినిపించి రోజాను విడిపించారు. కార్యక్రమంలో కర్రె జంగయ్య, మేకల హరినాథ్, గడ్డం నర్సింగ్‌రావు, బాలరాజు, ఖాదీర్, సలీం, మట్టి శ్రీను, బుర్రి యాదగిరి, నాగేష్, పోచయ్య, నదీమ్ పటేల్, ఇలియాస్, షర్ఫుసోఫీ, రాజుగౌడ్, అశోక్, ఇమ్రాన్, గణేష్, రాజు, మల్లేష్‌యాదవ్, చందుయాదవ్, వెంకట్‌యాదవ్ పాల్గొన్నారు.



రామారావునగర్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న బండి రమేశ్

బీసీలకు రాజీవ్ యువ వికాసం పథకం

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి ఝాన్సీరాణి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని నిరుద్యోగ యువతీ,యువకులకు స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రకటించిందని బీసీ అభివృద్ధిశాఖ జిల్లా అధికారి ఝాన్సీరాణి తెలిపారు. అర్హత 21–55 ఏళ్ల (01 జూలై 2025 నాటికి) కలిగి ఉన్న అభ్యర్థులు మాత్రమే ఉపాధి హామీ పథకాలకు అర్హులన్నారు. 21–60 ఏళ్లున్న అభ్యర్థులు భూ సంబంధ, ఉద్యాన, వ్యవసాయ పరికరాల పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థి సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ/ మున్సిపాలిటీ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు మించి ఉండకూడదన్నారు. దరఖాస్తుదారులు సూచించిన ధ్రువపత్రాలను జతపరచాల్సి ఉంటుందన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు లేదా ఆదాయ ధ్రువపత్రం, కుల ధృవీకరణపత్రం (తెలంగాణ ఏర్పడిన తర్వాత జారీ చేసినది మాత్రమే), డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగం వారికి మాత్రమే), పట్టాదార్ పాస్‌బుక్ (వ్యవసాయరంగం వారికి మాత్రమే), సదరం సర్టిఫికెట్ (దివ్యాంగులకు మాత్రమే) ప్రతులతో సహా పాస్‌పోర్ట్ సైజు ఫోటోను దరఖాస్తుతో జతపరచాలని ఆమె సూచించారు. మీ–సేవ నుంచి ధ్రువపత్రాలు.. మీ–సేవ నుంచి పొందినవి మాత్రమే అంగీకరించబడతాయని స్పష్టం చేశారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కలెక్టరేట్‌లోని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

చెరువులో దిగి బాలుడు మృత్యువాత



కార్తీక్(ఫైల్)

గచ్చిబౌలి: చెరువులోకి దిగిన బాలుడు నీట మునిగి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపిన ప్రకారం .. కామారెడ్డి జిల్లా డోంగ్లీ మండలం, కుర్లీ గ్రామానికి చెందిన దంపతులు బాయమ్మవార్ మల్కయ్య, బాలమణిలు నానక్‌రాంగూడ వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటున్నారు. వీరికి ఒక కూతురు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. పెద్ద కొడుకు కార్తీక్(14) నానక్‌రాంగూడలోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం మల్కయ్య, బాలమణి ఉదయం 7.30 గంటలకు పనులకు వెళ్లి సాయత్రం 5.30 గంటలకు తిరిగి వచ్చారు. కార్తీక్ కనిపించకపోవడంతో సమీప ప్రాంతాలలో వెదికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో విప్రోలేక్ (వెంకటయ్య చెరువు)లో బాలుడి మృతదేహం తేలియాడుతుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా తల్లిదండ్రులు కార్తీక్‌గా గుర్తించారు. బాలుడు మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'రాజీవ్ యువ వికాసం'ను పకడ్బందీగా అమలు చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

సాక్షి,సిటీబ్యూరో: రాజీవ్ యువ వికాసం పథకం కార్యక్రమం ద్వారా ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ అర్హులకు ఉపాధి అవకాశాలను కల్పించాల్సిన అవసరం ఉందని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజీవ్ యువవికాసం కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని రాధికాగుప్తా పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు వినోద్‌కుమార్, ఝాన్సీరాణి తదితరులున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఎంఐజీ కాలనీలో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

చందానగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర, సంతులిత అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. బుధవారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీలో సుమారు రూ.98.50 లక్షలతో సీసీ రోడ్లు, వరద నీటి కాలువ పనులకు కార్పొరేటర్ సింధు ఆదర్శరెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కాలనీల అభివృద్ధి ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం రూ.49.00 లక్షలతో సీసీ రోడ్లు, రూ.49.50 లక్షలతో వరద నీటి కాలువ నిర్మాణాలు చేపడతారన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.